## హిందూత్వ, జాతీయ దురహంకార విద్వేష రాజకీయాల గెలుపే ఎన్నికల్లో మోడీ విజయం

## దేశ ప్రజలారా! బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టుల, ప్రతీఘాతకుల అంతానికై

## తెగించి విశాల సమైక్య సమరశీల పోరాటాలు నిర్మించండి!

బూర్జువా నేతల బూటకపు వాగ్దానాల రణగొణ ధ్వనుల మధ్య 17వ లోక్‌సభకు అట్టహాసంగా సార్వత్రిక ఎన్నికలు ముగిసాయి. ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలేవి చర్చకు రాలేదు. ఒక లక్ష కోట్ల రూపాయల డబ్బు, మద్యం పారించి, ప్రజల్లో కుల, మతద్వేషాలను రెచ్చగొట్టి సుమారు 25 లక్షల సంఖ్యలో ప్రభుత్వ కిరాయి సాయుధ బలగాల తుపాకిమొనలను ప్రజలపై నిలిపి, కశ్మీర్‌లో 90 మంది జాతి విముక్తి పోరాటకారులను, మన విప్లవోద్యమ ప్రాంతాలలో 40 మంది విప్లవకారులను, ప్రజలను హత్య చేయడం ద్వారా బీభత్స వాతావరణాన్ని సృష్టించి ఓట్లు వేయించుకుని ప్రపంచంలో అతి పెద్ద  పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థ విజయం సాధించిందని చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో మోడీ నాయకత్వంలో బీ.జె.పి. మరొక్కసారి పూర్తి మెజారిటీతో కేంద్రంలో అధికారానికొచ్చింది. ఎన్నికల్లో 542 పార్లమెంటరీ సీట్లలో బి.జె.పి. 303 సాధించిసీట్లు సాధించగా, దాని మిత్రపక్షాలతో కూడుకొని (ఎన్‌డీఏ) 353 సీట్లు సాధించింది. ప్రతిపక్షాలు  ఈసారి ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతిన్నాయి. కాంగ్రెస్ 52 సీట్లకు పరిమితం కాగా, దాని మిత్రపక్షాలతో కూడుకుని యుపిఏ 90 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఉత్తరప్రదేశ్‌లో మహా కూటమి కేవలం 15 స్థానాలు సంపాదించింది. మొత్తం ప్రాంతీయ పార్టీలకు, ఇతరులకు 99 సీట్లు వచ్చాయి. ఇక చెప్పుకోవాలంటే బి.జె.పి తాకిడిని తట్టుకొని ఒడిస్సాలో నవీన్‌పట్నాయక్, తమిళనాడులో డిఎంకే – కాంగ్రెస్ కూటమి, కేరళలో కాంగ్రెస్, ఏపిలో వైఎస్ఆర్‌సిపి, బెంగాల్‌లో మమతబెనర్జీ గట్టిపోటీ ఇచ్చి అత్యధిక సీట్లు సాధించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో మాత్రం బి.జె.పి తన ఖాతా తెరవలేకపోయింది. ప్రధానంగా ఉత్తరభారతంలో బి.జె.పి, కాంగ్రెస్ ముఖాముఖి పోటీపడినా 186 స్థానాల్లో బి.జె.పి 174 స్థానాలు గెలవగా కాంగ్రెస్ 15 స్థానాలు మాత్రమే గెలిచింది. దేశంలో 20 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రాతినిథ్యాన్ని కోల్పోయింది.

లోక్‌సభకు ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. వీటిలో అరుణాచల్‌ప్రదేశ్‌లో మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో బి.జె.పి తిరిగి స్వీప్ చేసి విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును వినియోగించుకొని వైఎస్ఆర్ కాంగ్రెస్, సిక్కిం క్రాంతికారీ సంఘటన్‌లు అధికారంలోకి వచ్చాయి. ఒడియా జాతి ఆకాంక్షలను సహితం వినియోగించుకొని నవీన్ పట్నాయక్ నాయకత్వంలోని బిజెడీ 5వ సారి అధికారంలోకి రాగలిగింది. మొత్తం మీద చూసుకున్నప్పుడు ఈ ఎన్నికల్లో మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీకీ లభించిన ఘనవిజయానికి గల కారణాలను మనం లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

మోడీ ప్రభుత్వం గత ఐదు సంవత్సరాల పరిపాలనలో ప్రజావ్యతిరేక, సామ్రాజ్యవాద, దళారీ పాలకవర్గ అనుకూల దేశద్రోహ విధానాలను పెద్దెత్తున అమలు చేయడం వల్ల దేశ ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నం అయింది. జిడిపి రేటు 6%నికి పడిపోయింది. నిరుద్యోగం 6.5%నికి పెరిగింది. నోట్ల రద్దు, జిఎస్టీతో ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడింది. రైతాంగం నిస్సహాయ స్థితిలోకి నెట్టబడి వేలాది మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కార్మికుల హక్కులు హరించివేయబడుతున్నాయి. చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు పెద్ద సంఖ్యలో దెబ్బతిన్నాయి. మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు దేశాన్ని బార్లతెరిచి ఎఫ్‌డీఐని వందశాతం ప్రభుత్వరంగ పరిశ్రమల్లోకి ఆహ్వానించింది. ఎగుమతులు దెబ్బతిన్నాయి. రూపాయి, డాలరు మారకంతో 76 రూపాయలకు పడిపోయింది. బడా దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు మూడున్నర లక్షలు బ్యాంకు ఋణం మాఫీ చేసి, ఆ భారాన్ని అంతా పేద ప్రజలపై మోపింది. అది బ్రాహ్మణీయ హిందూత్వ రాజకీయాలతో మైనారిటీలు, దళితులు, ఆదివాసులు, పీడిత జాతులపై ఘోరమైన హింసాకాండ కొనసాగిస్తున్నది. సెక్యులర్, ప్రజాస్వామిక, దేశభక్తియుత శక్తులపై దాడులు కొనసాగిస్తున్నది. 'అర్బన్ నక్సల్స్' పేరిట పదుల సంఖ్యలో మేధావులను, ప్రజాస్వామిక శక్తులను జైళ్లల్లో నిర్బంధిస్తున్నది. ఈ విధంగా అది చేయని నేరమంటూ లేదు. దీని ఫలితంగా భారతీయ జనతా పార్టీ రాజకీయ ప్రతిష్ఠ క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఎందుకంటే చెప్పుకోవడానికి అది తన పాలనలో దేశాభివృద్ధి కోసం చేసిందేమీ లేదు. దీంతో 2018 నవంబర్‌లో జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవిచూసింది. ఈ ధోరణి 2018 డిసెంబర్ వరకు కొనసాగింది. నవంబర్ ఎన్నికల ఓటమి ప్రభావం పడకుండా లోక్‌సభ  ఎన్నికల్లో గెలుపు సాధించే లక్ష్యంతో అది సంఘ్ పరివార్‌తో కలిసి దేశ, విదేశీ కార్పొరేట్ ఘరానాల, భూస్వాముల దన్నుతో ఒక్క మాటలో ధనబలం, కండబలం, అధికార బలంతో సర్వశక్తుల్ని కేంద్రీకరించి అతిపెద్ద దూకుడు పథకాన్ని రూపొందించింది. బూత్ మేనేజ్‌మెంట్ దాని ప్రధాన విధానమయింది. ప్రజలలో భ్రమలు రేకెత్తించే సంక్షేమ పథకాలపై ప్రచార హోరును సృష్టించి, పలు బూటకపు వాగ్దానాలతో కూడిన బడ్జెట్‌ను రూపొందించింది. దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపించి అందుకు అన్ని రాజకీయ పార్టీలు సన్నద్ధం కావడం ప్రారంభించిన సమయంలో పుల్వామా ఘటన జరగటం, దీనిని సాకుగా చూపి పాక్ వ్యతిరేక యుద్ధోన్మాదాన్నీ, కుహనా జాతీయవాదాన్నీ, హిందూ మతోన్మాదాన్నీ రెచ్చగొడుతూ మోడీ ప్రభుత్వంబాలాకోట్ ఎయిర్ స్ట్రయిక్ నిర్వహించింది. హిందూ మతోన్మాద శక్తులు దేశం 'మోడీ చేతిలో ఉంటేనే దేశానికి రక్షణ' లభిస్తుందని, మోడీ తీసుకున్న సాహసోపేత చర్య వల్లనే పాకిస్తాన్‌ను తిప్పికొట్టామని, 'బలమైన కేంద్ర ప్రభుత్వం' కావాలని,  బాలకోట్ దాడి నిర్వహించిన వారికే ఓటు, 'భారతసేన మోడీ సేన' అంటూ పెద్దెత్తున ప్రచారం కొనసాగించింది. పుల్వామా ఘటన వెనుక మోడీ ప్రభుత్వ 'హస్తమే' ఇందులో ఉందన్నంతగా ఈ ఘటనను ఈ శక్తులు వినియోగించుకున్నాయి. దేశవ్యాప్తంగా పాకిస్తాన్ వ్యతిరేక ప్రదర్శనలు నిర్వహించాయి, "అబ్‌కా బారీ ఫిర్ మోడీ సర్కార్" అనే నినాదాన్ని ముందుకు తెచ్చాయి. ఇందుకు కార్పొరేట్ మీడియా బాగా ఉపయోగపడింది. దీంతో పాటు మోడీ ప్రభుత్వం పెద్దెత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడి సీబీఐ లాంటి కేంద్ర

సంస్థలను వినియోగించుకొని ప్రతిపక్షాలను నియంత్రించడం, చీలదీయడం, లొంగదీసుకోవడం చేసింది. ఎన్నికల్లో కుహనా జాతీయవాదాన్ని ప్రధానమైన అంశంగా చేయడంలో హిందుత్వ శక్తులు విజయం సాధించడంతో 'అభివృద్ధి' అంశం పూర్తిగా పక్కకుపోయింది. ప్రతిపక్షాలు లేవనెత్తిన నిరుద్యోగం, నోట్ల రద్దు, జిఎస్టీ, రాఫెల్ డీల్, రైతాంగ దుస్థితి మొదలైన మౌలిక, ముఖ్యమైన సమస్యలు పక్కకుపోయాయి. దీని వలన ప్రతిపక్షాలు ఒంటరి అయిపోయి చాలావరకు డిఫెన్స్ స్థితిలోకి నెట్టబడ్డాయి. ఈ పార్టీలన్నీ కూడా ప్రజావ్యతిరేక విధానాలను అనుసరించి ప్రజల విశ్వాసాన్ని కోల్పోవడంతో పాటు దాదాపు ఈ పార్టీలన్నీ అంతర్గత ముఠా తగవులతో బలహీన స్థితిలో ఉన్నాయి.

దీని ప్రభావం ఉత్తర, పశ్చిమ, మధ్య భారతంలో (ఒక్క పంజాబు మినహా) బాగా పడింది. బి.జె.పి. నేరుగా కాంగ్రెసుతో ముఖాముఖి పోటీ వున్న ప్రాంతాలు కూడా ఇవే కావడం గమనార్హమైన విషయం. ఇదే రీతిలో ప్రచారం గావించి, చాలా కాలం నుండి సంఘ్ పరివార్ శక్తులను అక్కడ రంగంలోకి దింపి పశ్చిమబెంగాల్ ఈశాన్య భారతంలోకి విస్తరించింది. ఈ ఎన్నికల్లో అది పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెసుకు, ఒడిస్సాలో బిజు జనతాదల్‌కు గట్టి పోటీదారుగా నిలిచింది.

ఈ ఎన్నికల్లో ఒకవైపు ఎన్డీఏ, మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో మహా కూటమి, బీహార్, ఝార్ఖండ్, కర్నాటక, మహారాష్ట్రల్లో కాంగ్రెస్ భాగస్వామ్యంతో ప్రాంతీయ పార్టీలు పోటీపడ్డాయి. ఎన్నికల ముందు 22 ప్రతిపక్షపార్టీలు కలిసి 'మోడీ హఠావో' అనే నినాదం తీసుకొని కొన్ని సమావేశాలు జరిపినప్పటికీ ఈ పార్టీలు ఒకే వేదిక మీద నుండి ఐక్యంగా బి.జె.పికి వ్యతిరేకంగా పోరాడలేకపోవడంతో వాటి ఓట్లు చీలిపోవడం, దేశంలో మోడీ ధాటికి నిలబడగలిగే సామర్థ్యం ప్రతిపక్షాల్లో ఎవరికి లేకపోవడం, మోడీ ప్రతి బహిరంగసభలో 'కమలానికి ఓటువేస్తే ఆ ఓటు మోడీకి వెలుతుందని' ప్రచారం చేయడం వలన బి.జె.పి. ప్రజాభిప్రాయాన్ని తనకు అనుకూలంగా మాలుచుకోగలిగింది. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ముస్లీంలను ఆకర్షించడంతో అక్కడ సమాజ్‌వాది పార్టీ అభ్యర్థులు చాలా మంది ఓటమిపాలైనారు.

ఈ మొత్తం ఎన్నిక సరళిలో ఎలక్షన్ కమీషన్ నిర్వహించిన పాత్ర పూర్తిగా బిజెపికి అనుకూలంగా ఉండడంతో దాని గెలుపుకు దోహదం చేసింది. ఎలక్షన్ షెడ్యూల్‌ను మోడీ, షాలు కొన్ని రాష్ట్రాల్లో కేంద్రీకరించి ప్రచారం చేయడానికి వీలుగా రూపొందించింది. ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్‌ల్లో 7 దఫాలుగా ఎన్నిక షెడ్యూలు రూపొందించడంతో మోడీ, షాలు ఈ రాష్ట్రాల్లో కేంద్రీకరించి ప్రచారం చేసుకోవడానికి ఉపయోగపడింది. మోడీతో సహా పలువురు బి.జె.పి. నాయకులు నిరంతరం ఎలక్షన్ కోడ్ ఉల్లంఘిస్తూ బాలకోట్ దాడిని తన ఎన్నికల ఉపన్యాసాల్లో పదే పదే పేర్కొనడం లాంటి విషయాలపై ఎన్నికల కమీషన్ ఎలాంటి చర్య తీసుకోకపోగా, ప్రతిపక్షాలు చేసిన ప్రసంగాల్లో వారిపై కొన్ని చర్యలు తీసుకోవడం వంటి పలు విషయాల్లో ఎన్నికల కమీషన్‌లోని బిజెపి పట్ల పక్షపాత వైఖరిని ప్రదర్శించింది.

బి.జె.పి. ఉత్తరప్రదేశ్‌లో సమాజాన్ని విభజించి బహుళ ప్రజల హిందూ ఓటుబ్యాంకు సంఘటితీకరణపై ఆధారపడి విజయం సాధించగా, ఎస్‌పి-బిఎస్‌పి-ఆర్‌ఎల్‌డి కూటమి, కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైనాయి. బీహార్‌లో కూడా ఇదే ప్రయోగంతో బి.జె.పి. కూటమి విజయం సాధించగా, ఆర్జేడీ నాయకత్వంలో కూటమి ఘోరంగా విఫలం అయింది.

పశ్చిమ బెంగాల్‌లో బలమైన టిఎంసితో పోటీపడి బి.జె.పి. 40 సీట్లలో 18 సీట్లు సాధించింది. ఈ రాష్ట్రంలో దశబ్దాలుగా పథకం ప్రకారం ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తున్నది. ఇక్కడ కూడ మెజారిటికి చెందిన హిందువులను సంఘటితపరచడంపై బి.జె.పి, ఆర్‌ఎస్‌ఎస్‌లు పని చేశాయి. టిఎంసి ప్రభుత్వం ముస్లింలకు ఇస్తున్న రాయితీలపై హిందువులను రెచ్చగొట్టె పని చేస్తూ వచ్చింది. దుర్గాపూజ పేరిట బి.జె.పి. చేస్తున్న పెద్దపెద్ద జన సమీకరణలను మమతా బెనర్జీ అడ్డుకోవడాన్ని హిందూ వ్యతిరేకమైనదని హిందువుల్లో ప్రచారం చేసింది. ఈ రకంగా హిందువులను సంఘటితం చేస్తూనే, టిఎంసి పార్టీలో గల ముఠా తగవులను వినియోగించుకొని పెద్ద సంఖ్యలో టిఎంసి నాయకులను, కార్యకర్తలను ఆకర్షించింది. దీనికితోడు టిఎంసి పార్టీ బాధితులైన సిపిఎం కార్యకర్తలతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దసంఖ్యలో బి.జె.పి.కి మద్దతునిచ్చారు. ప్రధానమంత్రి మోడీ, బి.జె.పి. అధ్యక్షుడు షా ఈ రాష్ట్రంలో చాలా సభలు నిర్వహించి రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. దీని వలన పశ్చిమ బెంగాల్‌లో గణనీయమైన స్థానాల్లో బి.జె.పి. విజయం సాధించింది.

పైన పేర్కొన్న కారణాలతో పాటు జెడి(ఎస్), కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వంలో గల ముఠా తగవులతో పాటు రెండు పార్టీల్లోనూ అంతర్గతంగా గల ముఠా తగవులతో ప్రజల్లో వారు కోల్పోతున్న ప్రతిష్టను ఉపయోగించుకొని ఈసారి ఎన్నికల్లో రికార్డు స్థాయిలో విజయాలు సాధించింది.

2018 డిసెంబర్‌లో మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెసు పార్టీకి ఈ ఎన్నికల్లో భారీ పరాజయం సంభవించింది. కాంగ్రెసు పార్టీ ఈ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన వెంటనే 2 లక్షల రూపాయల వరకు రైతు ఋణాలు రద్దుచేయడం, వ్యవసాయానికి విద్యుత్ అందించడంలో సబ్సిడీ నివ్వడం, చిన్న, మధ్య తరగతి రైతులకు పెన్షన్‌లు ఇవ్వడం లాంటి సంస్కరణలు అమలు చేస్తున్నది. ఈ రాష్ట్రాల్లో ప్రభుత్వాల పట్ల వ్యతిరేకత లేనప్పటికీ, కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాల వల్ల ఈ రాష్ట్రాల్లో మొత్తం 65 సీట్లలో బి.జె.పి 62 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెసుకు 3 సీట్లు మాత్రమే వచ్చాయి.

దక్షిణాదిలో కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లో బి.జె.పికి ఒక్క సీటుకూడా దక్కలేదు. తెలంగాణాలో మాత్రం ఈసారి 4 సీట్లు వచ్చాయి. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ఫలితాల్లో బి.జె.పి పట్ల దక్షిణాది ప్రజల్లో ఏ స్థాయిలో వ్యతిరేకత వుందో అర్థం చేసుకోవచ్చు. బి.జె.పి. తమిళనాడులో జెల్లికట్టు ఉద్యమం నుండి తమిళనాడు రాజకీయాల్లో తలదూర్చడం, ఏఐడీఎంకే కేంద్రానికి తొత్తుగా వ్యవహరించడం తదితర పరిణామాల వల్ల ప్రజల్లో దాని పట్ల వ్యతిరేకత పెరుగుతూ వచ్చింది. 'ఆక్యుపై మెరినా బీచ్' ఉద్యమంలో బి.జె.పి.కి, కేంద్రంకు వ్యతిరేకంగా ప్రజలు ముఖ్యంగా యువకులు, విద్యార్థులు అనేక పోరాటాలు నిర్వహించారు. ఈ ఉద్యమాలను డిఎంకె సమర్థిస్తూ రావడంతో ప్రజలు డిఎంకేను భారీ మెజారిటితో గెలిపించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత కేంద్రంలో 5 యేండ్లు పాలించిన బీజేపీ రాష్ట్రానికి ఇవ్వాల్సిన స్పెషల్ కేటగిరిని ఇవ్వకపోవడంతో ప్రజల్లో దాని పట్ల అసంతృప్తి ఏర్పడింది. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీ-వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నికల్లో

స్పెషల్ కేటగిరీ డిమాండ్‌ను బలంగా ముందుకు తేవడంతో పాటు చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత వల్ల, ప్రాంతీయ బడా పెట్టుబడిదార్లు జగన్‌ను సమర్థించడం వల్ల అధికారంలో వున్న టి.డి.పి ఘోరమైన ఓటమికి గురికావటంతో పాటు బి.జె.పి గతంలో గెలిచిన సీట్లను కూడా కోల్పోయింది.

కేరళలో హిందూత్వ హత్య రాజకీయాలతో పాటు శబరిమలలో ఆందోళనలు నిర్వహించినప్పటికీ బి.జె.పి వైపు ప్రజలు మొగ్గలేదు. ఈ మూడు రాష్ట్రాల్లో ప్రజల ప్రాంతీయ ఆకాంక్షలు, జాతి, భాషా ప్రత్యేకతలు, బలమైన ప్రాంతీయ నాయకత్వ అంశాలు బలంగా పనిచేశాయి. తన పునాదిని, ఓట్ల శాతాన్ని పెంచుకున్నప్పటికీ వీటిని ఎదుర్కొని బి.జె.పి నిలబడలేకపోయింది. ప్రత్యేకంగా తమిళనాడులో బలమైన మోతాదులో వున్న బ్రాహ్మణీయ హిందూత్వ, ఉత్తర భారతదేశ ఆధిపత్య, హిందీ భాషా ఆధిపత్య వ్యతిరేక భావనలు ఎన్నికలపై ప్రభావం కనపరచాయి.

తెలంగాణాలో టి.ఆర్.ఎస్‌కు బలమైన ఉత్తర తెలంగాణ జిల్లాలలో బి.జె.పి నాలుగు సీట్లు గెలిచింది. ఈ నియోజక వర్గాలలో బి.జె.పి గెలుపుకు హిందూత్వ రాజకీయాలతో పాటు స్థానిక రాజకీయ పరిస్థితులు దోహదం చేశాయి. కాంగ్రెసు పార్టీ దక్షిణ తెలంగాణాలో 3 సీట్లు గెలిచింది. ఈ ఫలితాలతో టి.ఆర్.ఎస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని అంచనా కట్టవచ్చు. స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు కవిత నిజామాబాద్ స్థానంలో ఓటమికి గురైంది.

ప్రతిపక్షాలు ప్రజల సామూహిక, ఆర్థిక సమస్యలతో పాటు బి.జె.పి వైఫల్యాలను బలంగా బహిర్గతపరచకుండా కుల, సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలతో బి.జె.పిని ఎదుర్కోలేక చతికిలబడినాయి. ఈ పార్టీలకు బి.జె.పి.కి వ్యతిరేకంగా గట్టిగా నిలబడి పోరాడిన చరిత్ర లేదు. దానికి తోడు ఈ పార్టీలు అధికారంలో వున్నకాలంలో ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేయడం, బూటకపు వాగ్దానాలు కుమ్మరించి అవి అమలు చేయకుండా పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు ఊడిగం చేయడం వల్ల ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ భ్రమలు కల్పించే 'జన్‌హితైషీ' ఎన్నికల ప్రణాళిక, ప్రత్యేకించి 'కనీస ఆదాయ చట్టం' పేరుతో 'ఇప్పుడు జరుగుతుంది న్యాయం', 'పేద కుటుంబం-72,000 రూపాయలు' అంటూ మీడియా సృష్టించిన ప్రచార హోరు ప్రజలను ఏమాత్రం ప్రభావితం చేయలేకపోయింది. దీంతో కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్ష హోదాను కూడా పొందలేకపోయింది. సీపీఐ, సీపీఐ (ఎం), టీడీపీ, పీడీపీ తదితర పార్టీలు సైతం ప్రజల విశ్వాసాన్ని సంపాదించలేక చతికిలబడిపోయాయి. టీఎంసీ కూడా ఆత్మరక్షణ స్థితిలోకి పోయింది. టీఆర్ఎస్‌కు కూడా గట్టి దెబ్బతగిలింది. ఆప్ పార్టీ అస్తిత్వమే ప్రమాదంలో పడింది. ఈశాన్య ప్రాంతంలోని ప్రాంతీయ పార్లమెంటరీ పార్టీలు బీజేపీకి దళారీ పార్టీలుగా మారిపోవడంతో అక్కడ బీజేపీ బలపడింది. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాలలో మోదీ వేవ్ పని చేయలేదు. ఈ విధంగా ఈ పార్లమెంటు ఎన్నికల ద్వారా ఫాసిజం మరింత బలంగా ముందుకు వచ్చింది.

ఏదిఏమైనా, ఈ ఎన్నికల్లో ఎన్నికల కమీషన్ పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్ని సర్కస్ ఫీట్లు చేసినప్పటికీ అధికారిక లెక్కల ప్రకారమే 63 శాతానికి మించి పోలింగ్ జరగలేదు. ఇది గత లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం కంటే 3 శాతం తక్కువ. పెద్దెత్తున ధనబలం, కండబలం, అధికార బలం, ప్రభుత్వ సాయుధ బలగాల దామినేషన్‌తో సాగించిన రిగ్గింగ్ శాతాన్ని తీసివేస్తే నిజమైన పోలింగ్ శాతం ఇంకా పడిపోతుంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బిహార్, ఝార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలలోని మన బలమైన ఉద్యమ ప్రాంతాలలో ఓటింగ్ శాతం 5-30కి మించదు. తుపాకీ బలంతో ఓట్లు వేయించడాన్ని నిరోధించడంలో భాగంగా, పోలీసు దాడుల నుంచి ఆత్మరక్షణ చేసుకోవడంలో భాగంగా మన పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ పోరాటయోధులు సంఘటిత ప్రజల మద్దతుతో దండకారణ్యం, బిహార్, ఝార్ఖండ్, ఒడిశా, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం, తెలంగాణ రాష్ట్రాలలో శత్రు బలగాలపై అనేక వీరోచిత దాడులు నిర్వహించి 35 మంది సాయుధ పోలీసులను నిర్మూలించి, 76 మందిని గాయపరిచారు. కశ్మీర్‌లో పెద్దెత్తున భయావహ వాతావరణం సృష్టించినప్పటికీ కొన్ని ప్రాంతాలలో 10 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. 'కశ్మీర్‌కు స్వాతంత్ర్యం కావాలి' అనే నినాదం అక్కడ మరోసారి మారుమోగింది. ఈశాన్య ప్రాంతాలలో కూడా ప్రజలు పలు చోట్ల ఎన్నికల్ని బహిష్కరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం కూడా ప్రజలు దేశంలో 165 చోట్ల ఎన్నికల్ని బహిష్కరించారు. ఓటు వేయకపోతే ఉగ్రవాది గానో, మావోయిస్టు గానో ముద్ర పడుతుందని, సొసైటీ (పిడిఎఫ్) బియ్యం దొరకవనే, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు కారనే దోపిడీ పాలకవర్గ రాజకీయ పార్టీల, ప్రభుత్వ సాయుధ బలగాల బెదిరింపులతోనూ, మరో నిజమైన ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లోనూ ఓటర్లు పెద్దెత్తున 'నోటా' బటన్‌ను నొక్కారు.

ఒక ప్రహసనంగా జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి పెద్ద మెజారిటీతో విజయం సాధించిందని చెబుతున్నప్పటికీ నిజానికి దానికి లభించిన ఓట్లు మొత్తం ఓటర్ల సంఖ్యలో 1/3వ వంతు మాత్రమే. అన్ని సెక్షన్ల ఓట్లను పొందామనీ, మత, కుల, ప్రాంత, లింగ అస్తిత్వాలకు అతీతంగా తనకు ఓట్లు పడ్డాయనీ బీజేపీ చెప్పుకోవడం ఎంత బూటకమో దీని ద్వారా స్పష్టమవుతున్నది. ఇది 'అతి పెద్ద ప్రజాస్వామిక వ్యవస్థ' దివాలాకోరుతునాన్ని సూచిస్తున్నది.

మోదీ తన విజయం తర్వాత 'విజయ్ భారత్' (భారత్ గెలిచింది) అనీ, 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' సాధించాననీ, తనకు ఓట్లు వేయని సామాజిక సెక్షన్ల వారిని కూడా కలుపుకొని పని చేస్తాననీ, రానున్న ఐదు సంవత్సరాల్లో తప్పుడు లక్ష్యం కోసం ఎలాంటి చర్యలకూ పూనుకోననీ, ఇది నా సంకల్పమా, అంకితభావమా, నిబద్ధతా ఏదైనా అనండి అంటూ ప్రజలకు ఇచ్చిన సందేశం మోసపూరితంగా, ఫాసిస్టు శైలిలో ఉంది. బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలను, సామ్రాజ్యవాద అనుకూల, భూస్వామ్య అనుకూల, ఫెడరల్ వ్యతిరేక, విస్తరణవాద విధానాలను కలిగి ఉన్న మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో తనకు గల మెజారిటీని వినియోగించుకొని తన ఫాసిస్టు నగ్న రూపాన్ని గతం కంటే మరింత క్రూరంగా ప్రదర్శించుకోవడానికి ఎంతో సమయం పట్టదు. మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం లోక్‌సభలో అత్యధిక మెజారిటీని సంపాదించుకోవడం, బలమైన పార్లమెంటరీ ప్రతిపక్షం లేకపోవడం, అంతకంటే ప్రధానమైనది

దేశంలో తీవ్రతరం అవుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభం, తీవ్రతరం కానున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు దాడినీ, 'నయా భారత్' నిర్మాణం పేరుతో అన్ని రంగాల్లో ప్రజలపై జరిగే పెనుదాడి ముప్పును సూచిస్తున్నాయి.

రెండవసారి అధికారంలోకి వచ్చిన వెనువెంటనే మోడీ ముఠా తన క్యాబినెట్‌లో, ఎనిమిది క్యాబినెట్ కమిటీలలో అమిత్ షా వంటి వారితో ప్రభుత్వాన్ని ఫాసిజీకరించడం ఆరంభించింది. సామ్రాజ్యవాద ఎంఎన్‌సీల ప్రయోజనాలను, దేశంలోని దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రయోజనాలను ఈడేర్చడమూ, దేశంలో 'బ్రాహ్మణీయ హిందూ రాజ్యాన్ని' స్థాపించడమే మోదీ ప్రభుత్వ ప్రధాన ఎజెండా.

కనుక అది సామ్రాజ్యవాదుల దోపిడీకి దేశాన్ని మరింత బార్లా తెరుస్తుంది. దేశ సహజవనరులు అన్నింటినీ సామ్రాజ్యవాదులు తన్నుకపోతారు. అందుకు దేశంలో ఫాసిస్టు పాలనతో ప్రజలపై తీవ్రమైన దమనకాండ కొనసాగిస్తారు. 'సమాధాన్' పథకాన్ని విప్లవోద్యమంపై, పీడిత జాతుల ఉద్యమాలపై, మత మైనారిటీలపై, దళితులపై, ఆదివాసులపై, ప్రజాస్వామిక ఉద్యమాలన్నింటిపై మరింత దూకుడుగా అమలు చేస్తూ ప్రజలపై ముఖ్యంగా ఆదివాసులపై, పేద ప్రజలపై అణచివేత పెంచుతారు. 'గో రక్షణ' పేరిట మూకదాడులు పెరుగుతాయి. ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక హక్కులపై తీవ్రమైన దాడి మరింతగా పెరుగుతుంది. మోడీ 'సబ్ కా సాత్ – సబ్ కా వికాస్ – సబ్‌కా విశ్వాస్' అనే నినాదం కేవలం సామ్రాజ్యవాదియోం కా ఉన్‌కా దలాలియోం కా సాత్ – ఉన్ లోగోం కే వికాస్ – ఉన్ లోగాం కా ఔర్ జ్యాదా విశ్వాస్ పొందడం కోసమే గానీ ప్రజల విశ్వాసం కాదని స్పష్టమవుతుంది. 'నూతన భారతం' పేరిట రాజ్యాంగాన్ని సవరించి హిందూ రాష్ట్ర రాజ్యస్థాపనకు ప్రయత్నాలు తీవ్రతరం అవుతాయి. 2019 తర్వాత అసలు ఎన్నికలు అనేవి ఉండవని అంటూ బి.జె.పి నాయకులు ఎన్నికలకు ముందు నుండే ప్రచారాన్ని చేస్తున్నారు. బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడడమే దేశభక్తి అని చాటుతూ రాజ్యాంగానికి సవరణ చేసి '370 ఆర్టికల్'ను, '35ఏ ఆర్టికల్'ను రద్దు చేస్తామనీ, నక్సలిజాన్ని సమూలంగా రూపుమాపుతామనీ, దేశవ్యాప్తంగా ఎన్‌ఆర్‌సీ (జాతీయ పౌరసత్వ సవరణ బిల్లు)ని అమలు చేసి పొరుగుదేశాల నుంచి శరణార్థులుగా వచ్చిన ముస్లిము ప్రజలను దేశం నుంచి తరిమివేస్తామనీ, హిందూ, బౌద్ధ మతాల ప్రజలకు ఆశ్రయమిస్తామని ప్రకటించి తన బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు రాజ్య ఎజెండాను బాహాటంగా ముందుకు తెచ్చింది. బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం నుంచి పొంచి వున్న పెను ప్రమాదాన్ని ప్రజలంతా గుర్తించాలి. దేశంలో ప్రజలకు రాబోయే రోజులు మరింత గడ్డుగా వుంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక, మధ్యతరగతి ప్రజల ఉద్యమాలను అణచివేయడం కోసం మరిన్ని క్రూరమైన చట్టాల్ని చేస్తాయి. కనుక విప్లవ, ప్రజాస్వామిక సంస్థలు, ప్రజలు ధైర్యంగా బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలి. బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు సిద్ధాంతాన్ని బహిర్గతపర్చాలి. ప్రజలు ఎక్కడికక్కడ తమ సమస్యలపై సమైక్య, మిలిటెంట్ ఆందోళనలు చేపట్టేలా మనం కృషి చేయాలి. ఇందుకు మన పార్టీ, ప్రజా సంస్థలు అన్నీ – విప్లవ, ప్రజాస్వామిక సంస్థలను వ్యక్తులను, శక్తులను, పార్టీలను ఐక్యం చేయడానికి కృషి చేయాలి.

అలాగే మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమంపై, కశ్మీర్, ఈశాన్య ప్రాంతాలలో కొనసాగుతున్న జాతి విముక్తి పోరాటాలపై దాడి తీవ్రమయ్యే నేపథ్యంలో పార్టీని మరింత సంఘటితం చేసుకోవాలి. దాన్ని కాపాడుకోవాలి. ప్రజాపునాదిని పెంపొందించుకుంటూ ప్రజాసైన్యాన్ని(పిఎల్‌జిఏ)ను పటిష్టం చేసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 'సమాధాన్' లేదా మరో పేరుతో కొనసాగించే నూతన వ్యూహాత్మక బహుముఖ దాడిని ఓడించడానికి, మన ప్రజాయుద్ధం సాధించిన విజయాల్ని కాపాడుకోవడానికి దేశవ్యాప్తంగా ప్రజా బాహుళ్యాన్ని మేల్కొల్పి విశాలమైన సమైక్య, సమరశీల ఉద్యమాలను నిర్మించాలి. బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని, అన్ని రకాల అభివృద్ధి నిరోధక, ఫాసిస్టు, విప్లవ ప్రతీఘాతుక శక్తులను కూకటివేళ్లతో పెకిలించి దేశంలో నిజమైన ప్రజాస్వామిక ఫెడరల్ రిపబ్లిక్‌ను స్థాపించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ప్రజా పోరాటాలను, ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయాలి. ప్రజలు సమైక్యంగా సమరశీలంగా తెగించి పోరాడిన రోజు బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టుల పతనమే కాదు ఈ దేశంలో ఏ ప్రతీఘాతకుల పతనం కూడా తప్పదు.